ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 139 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 28 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# 12 రాజ్యసభ స్థానాలకు ఏకగ్రీవం

## రాజ్యసభలో మెజార్టీ మార్క్ చేరిన బిజెపి



న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 (ప్రభాత ఉదయం): రాజ్యసభ ఉప ఎన్నికల్లో 12 స్థానాలూ ఏకగ్రీవమయ్యాయి. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 రాజ్యసభ స్థానాల్లో ఉప ఎన్నికల నిర్వహణకు ఇటీవల ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21వరకు నామినేషన్లు స్వీకరించగా.. తొమ్మిది స్థానాల్లో భాజపా, రెండు స్థానాల్లో ఆ పార్టీ మిత్రపక్షాలైన ఎన్సీపీ, ఆర్ఎల్ఎం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరోవైపు, తెలంగాణ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాజా పరిణామంతో ఎగువ సభలో ఎన్డీయే మెజార్టీ మార్కును అందుకుంది. తాజా ఎన్నికతో రాజ్యసభలో భాజపా బలం 96కి చేరగా.. మిత్రపక్షాలతో కలిపి ..మిగతా 2లో

# ఎమ్మెల్సీ కవితకు బెయిల్

### ఇడి, సిబిఐ కేసుల్లో బెయిల్ మంజూరు
### దర్యాప్తు పూర్తి కావడంతో బెయిల్‌కు అర్హురాలు
### సుప్రీం ద్విసభ్య ధర్మాసనం వెల్లడి







న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 (ప్రభాత ఉదయం): మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు ఎట్టకేలకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో గత ఐదు నెలలుగా తీహార్ జైలులో ఉన్న ఆమె విడుదల కానున్నారు. ఈ మేరకు సుప్రీం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఈడీ తరపున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు మూడు ప్రధానమైన కారణాలు చెప్పింది. సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ఈడీ కూడా దర్యాప్తు పూర్తిచేసిందని పేర్కొంది. దీంతో ఇక నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదంది. మహిళగా కూడా ..మిగతా 2లో



## తెలంగాణ భవన్ వద్ద సంబరాలు

### కుట్రపూరితంగా జైలులో పెట్టారన్న నేతలు
### సుప్రీంలో న్యాయం దక్కిందని వ్యాఖ్యలు

2

## కవిత బెయిల్‌పై బండి విపరీత వ్యాఖ్యలు

### కోర్టు ధిక్కరణగా పరిగణించాలన్న కెటిఆర్









### 17 నుంచి పది రోజుల పాటు

# ప్రజాపాలన

### హెల్త్, రేషన్ కార్డుల కోసం వివరాల సేకరణ
### ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారీకి నిర్ణయం
### గోషామహల్‌లో కొత్తగా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం
### సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి
### అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్ట్ 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిన సర్కార్.. ఇప్పుడు మరో దరఫా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది. రేషన్ కార్డు, హెల్త్ కార్డుల కోసం వివరాలు సేకరించనుంది. పూర్తి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలో ప్రతి పౌరుడికి హెల్త్ కార్డు మంజూరు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నాడు స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టీవ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ)పై అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో అధికారులకు సీఎం కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పది రోజుల పాటు మరోసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ..మిగతా 2లో



### జూరాల వద్ద కృష్ణమ్మ

# ఉగ్రరూపం

### గంటకు గంటకు జూరాలకు పెరుగుతున్న వరద
### 45 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 27(ప్రభాత ఉదయం) మహారాష్ట్ర, కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు కర్ణాటక జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జూరాల వరద కృష్ణమ్మా ఉగ్రరూపం దాల్చింది. కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. దీంతో కర్ణాటకు జలాశయాల నుంచి భారీగా వరద నీరు జూరాల జలాశయానికి వచ్చి చేరుతోంది. గంట గంటకు వరద ప్రవాహం పెరుగుతుం డటంతో మంగళవారం అప్రమత్తమైన జూరాల వరద నియంత్రణ అధికారులు ప్రాజెక్టు 45 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కర్ణాటక జలాశయాల నుంచి జూరాలకు 2,03,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా జూరాల 45 గేట్ల తెరిచి దిగువకు 1,82,385 క్యూసెక్కులు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.493 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తికి ..మిగతా 2లో

### చలో విద్యుత్ సౌధ మహాధర్నాకు వేలాదిగా

# ఉద్యోగులు తరలి రావాలి

### తెలంగాణ విద్యుత్ ఓసీ, బీసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి
### సెప్టెంబర్ 4న ఓసి, బిసి విద్యుత్ ఉద్యోగుల మహా ధర్నా



పోస్టర్ ను విడుదల చేస్తున్న విద్యుత్ ఓసి, బిసి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ

హైదరాబాద్, ఆగస్ట్ 27(ప్రభాత ఉదయం) విద్యుత్ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి సెప్టెంబర్ 4వ తేదీన చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఓసీ,బీసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి కోరింది. మంగళవారం నగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సెప్టెంబర్ 4న తన పెట్ట నున్న మహా ధర్నా పోస్టర్ ను జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కొడపాక కుమారస్వామి, కో చైర్మన్ ఆర్ సుధాకర్ రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, కో కన్వీన సి భాను ప్రకాష్ లు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కండిషన్లతో కల్పిస్తున్న పదోన్న తులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జి , జూడీషియల్ కమిషన్ చే విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కోరింది. విద్యుత్ సంస్థల్లో కల్పించిన పదోన్నతులను తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2019 అక్టోబర్ 24 తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వు W.P.No. 4415/2016 Dt. 10-12-2018 నష్టపోయిన బీ.సీ , ఓ.సీ. ఉద్యోగులకు పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేసింది. W.P.No. 47125/2018 Dt. 4-2-2019 కోర్టు తీర్పు మేరకు విద్యుత్ సంస్థల్లో అన్ని కేడర్లలో నేరుగా నియమించబడుతున్న ఉద్యోగుల సీనియారిటీలను మెరిట్ ఆధారంగా సర్వీస్ రెగ్యులేషన్ 26 (a) పార్ట్-II, తెలంగాణ స్టేట్ సబ్-ఆర్డినేట్ రూల్స్ 33 (b) & 36(i), హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రకటించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో అన్ని కేడర్ల తుది సీనియారిటిలను జూనియర్ లైన్మెన్ స్థాయి నుండి చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయి వరకు వెంటనే ప్రకటించాలి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు గతంలో యాజమాన్యాలు ఒప్పుకున్న ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



### ఎవరినీ

# వదిలిపెట్టం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, ఆగస్ట్ 27(ప్రభాత ఉదయం)చెరువు ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎవరినీ వదిలిపెట్టమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హైడ్రాలో మెంబర్స్‌గా మంత్రులు ఉన్నారు..అయినా సరే వారివి అక్రమ నిర్మాణాలు అని తేలితే కూల్చేస్తామని హెచ్చరించారు. ఒవైసీకి చెందిన ఫాతిమా కాలేజీ, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి కాలేజీలపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి.. ఇప్పటికే విచారణ ప్రారంభించామన్నారు. చెరువుల్లో నిర్మాణాలు చేసుకునేందుకు పర్మిషన్ ఇచ్చిన అధికారులను గుర్తించాం.. వారిని త్వరలోనే జైలుకు పంపుతామన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ను ప్రారంభించబోతున్నామన్నారు. హైడ్రా ఎవరికీ నోటీసులు ఇవ్వరు.. అక్రమంగా కట్టుకున్నారు అని విచారణలో తేలితే వెంటనే కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

# 17 నుంచి పది రోజుల పాటు ప్రజాపాలన



మొదటి పేజీ తరువాయి...

ఈ సమావేశంలో పాల్గొన్నారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి... ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి.. గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి భూ బదలాయింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణానికి ఆర్కిటెక్ట్‌తో డిజైన్లు రూపొందించాలన్నారు. వచ్చే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని నిర్మించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిజైన్లు ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కవిత బెయిల్‌పై బండి విపరీత వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్ట్ 27 (ప్రభాత ఉదయం): ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలా విజయమంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే బీఆర్ఎస్ సపోర్ట్ కారణంగా ఒకరు రాజ్యసభలో స్థానం పొందారంటూ వివాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం తొలుత వాదనలు వినిపించిన లాయర్‌కు కాంగ్రెస్ తరపున రాజ్యసభ సీటు వచ్చేలా కేసీఆర్ రాజకీయ చతురత ప్రదర్శించారంటూ ఆయన చేసిన ట్వీట్ చేశారు. వైన్ అండ్ డైన్ క్రైమ్ లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కంగ్రాట్యులేషన్స్ అంటూ స్థాయిని మరిచి సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేసేలా బండి సంజయ్ కామెంట్స్ చేశారు. దీనిపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయశాఖ మంత్రిగా ఉన్న బండి సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని తెలిపారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలా స్పందించడమేంటని నిలదీశారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా తీసుకుని బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ భవన్ వద్ద సంబరాలు

## కుట్రపూరితంగా జైలులో పెట్టారన్న నేతలు

## సుప్రీంలో న్యాయం దక్కిందని వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్ట్ 27 (ప్రభాత ఉదయం): ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషంలో మునిగిపోయారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఏ ఆధారాలు చూపకుండా అక్రమంగా 166 రోజులు జైల్లో పెట్టారని.. రాజకీయ ప్రేరేపిత కేసులో చివరకు న్యాయమే గెలిచిందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా, కవితకు బెయిల్ ఇవ్వడం పట్ల సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు న్యాయమే గెలిచిందని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగత్తిన్నామని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొంత ఆలస్యమైనా న్యాయమై గెలిచిందని అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసు అని ఆయన పేర్కొన్నారు. కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తున్నారని అన్నారు. చివరికి న్యాయమే గెలిచింది ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి  అన్నారు. కవితకు బెయిల్ రావడం తెలంగాణ ఉద్యమకారులకు ఊపిరినిచ్చిందని మాజీ స్పీకర్, ఎమమెల్సీ మధుసూధనాచారి అన్నారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని దేవీ ప్రసాద్ అన్నారు. కవితపై కుట్రపూరితంగా కేసుపెట్టారని ఆయన అన్నారు. తమపై ఆరోపణలు చేసినవారందరికీ ఈ తీర్పు చెంపపెట్టు అని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు పార్టీ కార్యలయం వద్ద పలువురు సంబరాలు చేసుకునన్నారు. కవిత ఇక తిరిగి తెలంగాణ రాజకీయాల్లో పాల్గొంటారని ప్రకటించారు.



# హైడ్రా అంటే కాంగ్రెస్ నాయకులకు జేబు సంస్థగా మారకుండా, అక్రమార్కులను శిక్షించే సంస్థగా ఉండాలి

## మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం) హైడ్రా అంటే కాంగ్రెస్ నాయకులకు జేబు నింపే సంస్థగా మారకుండా అక్రమార్కులను శిక్షించే సంస్థగా ఉండాలని మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల  మహేందర్ అన్నారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ డైరెక్టర్ ఏవీ. రంగనాధ్ ను మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ మహేందర్ మర్యాదపూర్వకంగా కలిసి కూకట్ పల్లి నియోజక వర్గంలో ఉన్న చెరువు కబ్జాల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న చెరువులను కాపాడాలని, ఎఫ్టీఎల్ పరిధిలో ఎప్పుడో నిర్మించిన భవనాలను కూల్చి వేయాడంలో కొంత ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, పేద ప్రజలకి అన్యాయం జరగకుండా చూడాలని అన్నారు. బడా బాబులు ఎఫ్టిఎల్ పరిధిని మార్చి అక్రమంగా పర్మిషన్లు తీసుకొని నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపాలని, భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలు జరగకుండా, ఎఫ్‌టిఎల్ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని, హైడ్రా డ్రామా కాకుండా అక్రమార్కులపై ఉక్కు పాదం మోపి ఆదర్శవంతంగా నిలవాలని అన్నారు. కాంగ్రెస్ నాయకుల జేబు సంస్థగా మారకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు కోరడంతో తప్పకుండ చర్యలు చేపడుతామని డైరెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.

# ఎమ్మెల్సీ కవితకు బెయిల్

మొదటి పేజీ తరువాయి...

పరిగణించాల్సి ఉందని అభిప్రాయపడింది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ)ఈ ఏడాది మార్చి 15న అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ అప్పట్లో ప్రకటించారు. అరెస్ట్ వారెంట్‌తో ఆమె ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు తొలుత సోదాలు నిర్వహించి, మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం విచారించి కవిత వాంగ్మూలం నమోదు చేశారు. ఆమె నుంచి ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కవితను తిహార్ జైలుకు తరలించారు. ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ 2022 ఆగస్టులో సీబీఐ కేసు నమోదు చేసింది. ఇదే కేసులో హైదరాబాద్‌కు చెందిన మద్యం వ్యాపారి అరుణ్ రామచంద్రపిళ్ళై వాంగ్మూలాన్ని సేకరించిన అనంతరం కవితకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం టెండర్ల వ్యవహారంలో సౌత్ లాబీ తరపున రూ.కోట్లు చేతులు మారాయనే కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అరుణ్ రామచంద్రపిళ్ళై రిమాండ్ నివేదికలో అతడిని కవిత బినామీగా పేర్కొంది. ఈ సౌత్ గ్రూప్ ద్వారా రూ.100కోట్ల ముడుపులు ఆప్‌కు హవాలా మార్గంలో అందాయని అభియోగం మోపింది. గతేడాది మార్చిలో కవితకు నోటీస్ జారీ చేసి విచారించింది. ఆ తర్వాత మరోమారు కూడా సమన్లు జారీ చేసింది. అవి మహిళలకు ఉన్న హక్కులను ఉల్లంఘించేలా ఉన్నందున వాటిని కొట్టేయాలని ఆమె గత ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టును ఆశ్రయించి అప్పట్లో ఉపశమనం పొందారు. సరిగ్గా ఈ ఏడాది అదే రోజు ఆమెను ఈడీ అరెస్టు చేసింది. ఇదే కేసులో ఆప్ నేత మనీస్ సిసోడియాకూడా ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. దీంతో కవతకు కూడా ఏరట దక్కడం ఖాయమని బిఆర్ఎస్ నేతలు భావిస్తూ వచ్చారు.

# టీచర్లు లేక పాఠశాలలు మూసివేత

## గిరిజన ప్రాంతాల్లో 43 స్కూళ్ల మూత

## సిగ్గు చేటని వ్యాఖ్యానించిన హరీష్ రావు

హైదరాబాద్, ఆగస్ట్ 27 (ప్రభాత ఉదయం): ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు అన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, తాగునీరు, రైతు రుణమాఫీ విషయాల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు  మూసివేశారని, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ హరీశ్ రావు ఎక్స్(ట్విటర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుంది.. కానీ కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకు నోచుకోని పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి కాదు రెండు కాదు 43 పాఠశాలలు.. అదీ గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాన్నారు.ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమని తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించింది ఉన్న స్కూళ్లను మూత వేయడానికా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మూతపడ్డ 43 ప్రభుత్వ పాఠశాలలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. టీచర్ల నియామకం జరిగేవరకు విద్యా వాలంటీర్లను నియమించాలని విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు లేరన్న కారణంతో రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా చూడాలని, వెంటనే ముఖ్యమంత్రి స్థాయిలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలని ఎక్స్ వేదికగా కోరారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుందని, కానీ కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు చదువుకు నోచుకోని పరిస్థితి దాపురించిందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమంటూ ధ్వజమెత్తారు.



రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ కు చేస్తున్న ఎస్ ఏ ఓ వీరస్వామి

# నూతన విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

మెహదీపట్నం, ఆగస్టు27(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ నూతన సూపర్డెంట్ ఇంజనీర్ శ్రీరామ్ మోహన్ కు సర్కిల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం మెహిదీపట్నంలోని నానల్ నగర్ లో గల విద్యుత్ ఎస్ ఈ కార్యాలయంలో ఎస్ ఏ ఓ లు వీరస్వామి, రవికుమార్, అకౌంట్స్ ఆఫీసర్లు హరీష్ చంద్రశేఖర్, మురళీ గౌడ్, రవీందర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగరాజు లు ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ మాట్లాడుతూ... ప్రభుత్వం, యాజమాన్యం ఆదేశాల మేరకు ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న విద్యుత్తు పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం నిరంతర, నాణ్యమైన విద్యుత్తును అందించాలని సంకల్పంతో ముందుకు వెళుతుందని అందుకోసం క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది బాధ్యతగా పనిచేసే ప్రజలకు సేవలు అందించడంతోపాటు సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

# జూరాల వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం

మొదటి పేజీ తరువాయి...

28,764 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, క్యూసెక్కులు,కోయిల్ సాగర్ కు630, క్యూసెక్కులు, ఎడమ కాలువకు 820, కుడి కాలువకు 485 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం జూరాల నుంచి 2,13,925 క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా మరి కొన్ని రోజుల పాటు వరద ప్రవాహం ఇలాగే కొనసాగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి కర్ణాటక లోని ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 96,781 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 1.16లక్షలు క్యూసెక్కులుగా నమోదైంది. ఆల్మట్టి సామర్థ్యం 129.72 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 125.47 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1.50 లక్షల క్యూసెక్కులు ఉండగా.. 25 గేట్లు తెరవగా.. అవుట్‌ఫ్లో 1.61లక్షల క్యూసెక్కులు నమోదైంది. నారాయణపూర్ సామర్థ్యం 37.64 టీఎంసీలకుగానూ 29.53 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

# 12 రాజ్యసభ స్థానాలకు ఏకగ్రీవం

మొదటి పేజీ తరువాయి...

ఎన్డీయే ఆ బలం 112గా ఉంది. దీనికితోడు అధికార పార్టీకి ఆరుగురు నామినేటెడ్, ఒక స్వతంత్ర సభ్యుడి మద్దతు కూడా ఉంది. తాజాగా కాంగ్రెస్ నుంచి ఒక సభ్యుడు గెలుపొందడంతో రాజ్యసభలో ప్రతిపక్షాల బలం 85కి పెరిగింది. రాజ్యసభలో ప్రస్తుతం మరో ఎనిమిది స్థానాలు ఖాళీగా ఉన్నాయి. జమ్మూకశ్మీర్‌లో నాలుగు, మరో నాలుగు నామినేటెడ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో రాజ్యసభలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 237గా ఉండగా.. ఇందుకు మెజార్టీ మార్కు 119గా ఉంది. కొత్త సభ్యులను కలిపి చూస్తే.. ఎన్డీయేకు రాజ్యసభలో మెజార్టీ ఉంది. కగ్రీవంగా ఎన్నికైన  అభ్యర్థుల్లో ..కిరణ్ చౌధరి (భాజపా, హరియాణా), మమతా మొహంతా (భాజపా, ఒడిశా), మిషన్ రంజన్ దాస్ (భాజపా, అస్సాం), రామేశ్వర్ తేలీ (భాజపా, అస్సాం), ధైర్యశీల్ పాటిల్ (భాజపా, మహారాష్ట్ర), రవ్‌నీత్ సింగ్ బిట్టూ (భాజపా, రాజస్థాన్), ఉపేంద్ర కుశ్వాహా (రాష్ట్రీయ లోక్ మోర్చా, బిహార్), నితిన్ పాటిల్ (ఎన్సీపీ–మహారాష్ట్ర–), మనన్ కుమార్ మిశ్ర (భాజపా, బిహార్), జార్జి కురియన్ (భాజపా, మధ్యప్రదేశ్), రాజీబ్ భట్టాచార్య (భాజపా, త్రిపుర), అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్– తెలంగాణ) ఉన్నారు.

# అంగరంగా వైభవంగా శ్రీజమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం

## కళ్యాణోత్సవానికి కార్యక్రమానికి హాజరైనా ప్రముఖులు.. వందలాదిగా తరలివచ్చిన భక్తులు



శ్రీజమ్ములమ్మ జమదగ్నిల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీ జమ్ములమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి



గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, ఆలయ చైర్మన్ గాయత్రి సతీష్ కుమార్



కళ్యాణోత్సవంలో మాంగల్యానికి మొక్కుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, జ్యోతి దంపతులు

గద్వాల ప్రతినిధి,ఆగస్టు27(ప్రభాత ఉదయం) నడిగడ్డ ఇలవేల్పుగా విరాజిల్లుతూ అఖండ భక్త జనంతో పూజలందుకుంటున్న జములమ్మ అమ్మవారి కల్యాణ వార్షిక మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. శ్రీజమదగ్ని, జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణోత్సవ మహోత్సవ కార్యక్రమం మంగళవారం గద్వాల పట్టణ పరిధిలోని శ్రీ జమ్ములమ్మ , పరశురామ స్వామి దేవస్థానం నందు జమదగ్ని, జమ్ములమ్మ అమ్మవారు ఒక్కటయ్యారు. శ్రావణ, బహుళ, నవమి, మంగళవారం మధ్యాహ్నం 12గంటల 15 నిమిషాల సుమూహూర్తమున స్వామివారు, అమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. అంతకుముందు సంప్రదాయం ప్రకారం.. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం పెట్టారు. కల్యాణ తంతును వందలాది మంది భక్తులు చూసి ధన్యులయ్యారు. కాగ ఉదయం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బండ్ల జ్యోతి దంపతులు పట్టువస్త్రాలు, పసుపుకుంకుమలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ గాయత్రి సతీష్ కుమార్, ఈఓ పురేందర్ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనందున ఆలయ నిర్వహకులు, పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల మాట్లాడు తూ.... జమ్ములమ్మ అమ్మవారు వెలిసిననాటి నుంచి మాఘమాసంలో అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పాలక మండలి కమిటి చైర్మన్ గాయత్రీ సతీష్ కుమార్ , సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి కళ్యాణోత్సవ వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం నాలుగో మంగళవారం అమ్మవారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, విస్తారంగా వర్షాలు కురవాలని, పాడిపంటల సమృద్ధిగా కలగాలని కోరారు.

### కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

జమదగ్ని, జమ్ములమ్మ కళ్యాణోత్సవ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ సరితాతిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సత్య రెడ్డి, జి. వేణుగోపాల్, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, జెడ్పీటిసిలు, మాజీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం జమ్ములమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం, నడిగడ్డ ప్రాంతంలో రైతులకు సకాలంలో వర్షాలు పండాలి. రైతుల పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, రైతు అభివృద్ధి చెందాలన్నారు. వ్యాపార, విద్యా వైద్య రంగాలలో సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని అదేవిధంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్లకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలి

## ఏపీఎస్ఈబి నిబంధనలతో ఆర్టిజన్లకు సర్వీసులు క్రమబద్ధీకరించాలి
## ఆర్టిజన్లకు వేతనాలు పెంచాలి

రాజేంద్రనగర్, ఆగస్ట్ 27(ప్రభాత ఉదయం) విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ లకు ఇతర అధికారులు, ఉద్యోగుల మాదిరిగా తమకు పదోన్నతులు కల్పించాలని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ యాజమాన్యాన్ని కోరింది. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని కాటేదాన్ విద్యుత్ సెక్షన్లో డివిజన్లో పనిచేస్తున్న విద్యుత్తు ఆర్టిజన్ ఉద్యోగులు సమావేశమై తమ సమస్యల కోసం సమిష్టిగా కలిసి పని చేద్దామని నిర్ణయించారు. ఈ సందర్భంగా డివిజన్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏపీఎస్ఈబి రూల్స్ ను పాటించి తమకు పదోన్నతులు కల్పించాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. తాము సంస్థలో నిరంతర సేవలను సమయం పాలన లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నామని యాజమాన్యం తమ పట్ల సానుకూల దృక్పథంతో విద్యార్హతను బట్టి పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సుమారు మూడు దశాబ్దాల కాలం విద్యుత్ సంస్థలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని తమకు ప్రభుత్వం, యాజమాన్యం ఆలోచించి పదోన్నతులు కల్పించి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరి వేతనాలు పెంచాలని కోరారు. యాజమాన్యం తమ పట్ల సానుకూల దృక్పథంతో తమ సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో కంపెనీలో పనిచేస్తున్న ఆర్టిజన్లు యూనియన్లకు అతీతంగా తమ సమస్యల పోరాటానికై సిద్ధమవుతామని హెచ్చరించారు.



కాటేదాన్ విద్యుత్తు సెక్షన్ కార్యాలయంలో తమ సమస్యలపై సమావేశమైన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్

## అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలి: కార్పొరేటర్ ఎం సంగీత

రాజేంద్రనగర్, ఆగస్ట్ 27(ప్రభాత ఉదయం) అభివృద్ధి పనులు నాణ్యతగా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ అధికారులకు సూచించారు. మంగళవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ లో ఐదు లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సంగీత పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ... ప్రజాధనం వృధా కాకుండా అధికారులు పనుల నిర్వహణపై పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించాలన్నారు. డివిజన్లో అభివృద్ధి పనులు దశలవారుగా చేపట్టి అత్తాపూర్ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. బస్తీ ప్రజల కు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దశలవారీగా క్షేత్ర స్థాయిలో అధికారులతో చర్చించి పరి శీలించి, పూర్తి చేయిస్తామని బస్తి వాసులకు హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వనం శ్రీరామ్ రెడ్డి ,బిజెపి నాయకులు బీట్కూరి సిద్దేశ్వర్, ఎల్ వెంకటేష్, హనుమంతరావు ,బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా బిజెపి ఇన్‌ఛార్జ్‌గా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ



రాజేంద్రనగర్, ఆగస్ట్ 27(ప్రభాత ఉదయం) జగిత్యాల జిల్లా బిజెపి ఇన్ ఛార్జ్ గా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డి సత్యనారాయణ మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలిపి లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతను అప్పజెప్పిన ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శులు ఈశ్వరప్ప, నందనం దివాకర్ , మోర్చా రాష్ట్ర పార్టీకి జిల్లా నాయకులకు అందరికీ సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.



బాణ సంచా కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## చివరికి న్యాయమే గెలిచింది

### ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంపై రాజేంద్రనగర్ లో బీఆర్ఎస్ నేతల సంబురాలు

బుద్వేల్, ఆగస్టు27(ప్రభాత ఉదయం): ఎమ్మెల్సీ కవిత కు బెయిల్ మంజూరు కావడంతో రాజేంద్రనగర్ సర్కిల్ లో బీఆర్ఎస్ శ్రేణులు సంతోషంలో మునిగిపోయారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పరపల్లి లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఏ ఆధారాలు చూపకుండా అక్రమంగా దౌర్జన్యంగా 166 రోజులు జైల్లో పెట్టారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి అభిప్రాయపడ్డారు. ,కవిత కు బెయిల్ ఇవ్వడం పట్ల సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు..కొంత ఆలస్యమైనా న్యాయమే గెలిచిందని అభిప్రాయ పడుతున్నాం అన్నారు. ఇది రాజకీయ ప్రేరేపిత కేసుగా మేము భావిస్తున్నాం అని అన్నారు. కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తుననన్నారని గుర్తు చేశారు. ఆరోపణలు చేసినవారందరికీ ఈ తీర్పు చెంపపెట్టు అని భావిస్తున్నాం అన్నారు.





వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్ల పై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

## వినాయక నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తాం

### డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్

బుద్వేల్, ఆగస్టు27(ప్రభాత ఉదయం):రాజేంద్రనగర్ సర్కిల్ లో జరిగే వినాయక నిమజ్జనం ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు , అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్, మండపాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ మాట్లాడుతూ, విద్యుత్, వాటర్ వర్క్స్ , గ్రేటర్ ఎలక్ట్రికల్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం, పోలీస్ శాఖల కు చెందిన అధికారుల సమన్వయంతో గత సంవత్సరం కంటే మరింత ఉన్నతంగా నిమజ్జన ఉత్సవాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ సమీపంలోని పత్తి కుంట లో మూడు క్రేన్లు, మైలార్ దేవ్ పల్లి పల్లె చెరువులో రెండు క్రేన్ లు, మీరాలం చెరువులో ఒక క్రేన్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయకుమార్ , ఏసీపీ తుల శ్రీనివాస్ , రాజేంద్రనగర్, మైలార్ దేవ్ పల్లి, ఇన్స్ పెక్టర్లు క్యాస్ట్రో , పి నరేందర్ , వివిధ శాఖల అధికారులు నరేందర్ గౌడ్, శ్రీనివాస్, రామారావు, సత్యనారాయణ , అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఎన్. మల్లారెడ్డి , సామ ఇంద్రపాల్ రెడ్డి , ఎం కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

**వీధి దీపాలను ఏర్పాటు చేయండి :**

ప్రధాన రహదారుల్లో, బస్తీలలో చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి వరకు వీధి దీపాలు అన్ని వెలిగేటట్లు చూడాలన్నారు. పత్తి కుంట, పల్లె చెరువులో గురపు డెక్కను తొలగించాలన్నారు. పాడైన రోడ్లను బాగు చేయాలని అన్నారు.



సీజనల్ వ్యాధులకు పై ప్రజలకు అవగాహన కల్పించడానికి సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప

## ప్రజలకు అన్ని వైద్య సేవలు అందించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సిద్దప్ప

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(ప్రభాత ఉదయం) ప్రజలకు అన్ని వైద్య సేవలు అందించాలని జోగులాంబ గద్వాల జిల్లా జిల్లావైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప సూచించారు. మంగళవారం జిల్లా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న ఎం ఎల్ హెచ్ పి సిబ్బంది కి జిల్లా స్థాయి ఓరియంటేషన్, కాంప్రహెన్సివ్ ప్రైమరీ హెల్త్ కేర్, హెచ్ఐవి ఎయిడ్స్, దిశా ప్రోగ్రాం పై సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప మాట్లాడుతూ... ప్రతి వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని, హెచ్ఐవి ఎయిడ్స్ , అన్ని విషయాలు తెలుసుకుని, ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సంధ్యా కిరణమైయి, డిపిఎం మాధవి, డిడియం రామాంజనేయులు,కళ్యాణి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, బిఏఎంఎస్ డాక్టర్లు, ఎయిడ్స్ దిశా ప్రోగ్రాం సిబ్బంది రాఘవేంద్ర రెడ్డి , రమేష్ , డిఎండిఓ సాయికుమార్ పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితే తప్పా స్పందించరా.?

బుద్వేల్, ఆగస్టు27(ప్రభాత ఉదయం) : శివరాం పల్లి ప్రశాంత్ కాలనీలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదాలను పొంచి ఉన్న విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజుల క్రితం ఈ స్తంభాలకు ఆనుకొని ఉన్న ఎండిన చెట్టును డీసీఎం ఢీ కొనడంతో ఆ చెట్టు పూర్తిగా స్తంభంకు ఉన్న తీగలపై పడటంతో మరింత ప్రమాదాన్ని పొంచి ఉందన్నారు. . ఈ మార్గంలో నిత్యం వాహనాలు, పాఠశాలలకు రాకపోకలు సాగిస్తుండటం తో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడైన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన అధికారులు పట్టించుకోవడంలేదని విచారం వ్యక్తం చేశారు. అధికారుల తీరు చూస్తుంటే ప్రమాదం జరిగితే తప్ప... పట్టించుకోము అన్నట్లుగా అనిపిస్తుంది. అసలే వర్షాకాలం కావడంతో ఏ క్షణం ప్రమాదం సంభవిస్తానని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు



ప్రశాంత్ కాలనీలో ఒంగి పోయిన విద్యుత్ స్థంభం

## బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ కోర్సులో మాస్టర్ శ్రీహరికి అవార్డు

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(ప్రభాత ఉదయం) గద్వాలకు చెందిన శ్రీహరికి అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ కోర్సులో అవార్డు లభించింది. ఈనెల 21వ తేదీ నుండి 26వ తేదీలలో జారండ్ లోని రాంచినందు అంతర్జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ కోర్స్ లో పాల్గొని పట్టా తీసుకున్న మాస్టర్ కే శ్రీహరి ని ఉమ్మడి జిల్లా టెక్నికల్ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి పూలమాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, రాజేశ్వర, సుధీర్ కుమార్ ,శాంతి ,హరి, సాయి సన్మానించారు.



## కుక్కలు బాబోయ్ కుక్కలు

### ఇండ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్న జనం
### ఏ వీధి చూసిన దర్శనమిస్తున్న గ్రామ సింహాలే
### గ్రామసింహాల నుంచి రక్షించండి మహా ప్రభో అని వేడుకుంటున్న ప్రజానీకం

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు27(ప్రభాత ఉదయం)గద్వాల మున్సిపాలిటి పరిధిలో ఎక్కడ చూసినా కుక్కలు సైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ వార్డులో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు కనబడుతుండటంతో స్కూల్ కి వెళ్లే పిల్లలను కుక్కలు ఏమి చేస్తాయో అని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కుక్కల బెడదను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గద్వాల మున్సిపాలిటి పరిధిలోని 24వ వార్డు అహ్మద నగర్ కాలనీలో కుక్కల భయానికి ఇళ్ల నుంచి బయటికి రావాలంటే కాలనీవాసులు భయపడుతున్నారు. ఇంటి ముందర పిల్లలు ఆడుకోలేకపోతున్నారు. ఇంటి ముందర కుక్కల గుంపు చూసి ఇంటి యజమానులు గేట్లకు లాక్ వేసి లోపలే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదనుంచి రక్షించాలని కోరుతున్నారు.



# దోమలపై రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది



శాస్త్రిపురం లో ఓ ఇంటి ముందు ఉన్న గంపలో నీరు ఉండటం వల్ల దోమ లార్వా ఎలా పెట్టిందో గృహ యజమాని కు చూపుతున్న ఎంటమాలజీ సిబ్బంది



అత్తాపూర్ ఖాజా నగర్ లో ఇంటి ముందు ఉన్న నీళ్ల డ్రమ్ములో దోమల లార్వా ఉండకుండా యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్న సిబ్బంది

బుద్వేల్, ఆగస్టు27(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. ఇటీవల నగరంలో వాతావరణ మార్పుల నేపథ్యంలో డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి విష జ్వలాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవ్ పల్లి , సులేమాన్ నగర్ , శాస్త్రి పురం డివిజన్ల లోని ప్రతి ఇంటికి వెళ్లి దోమల నిర్మూలలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు . అదే సమయంలో ప్రతి ఇంటి వద్ద యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్నామని తెలిపారు. సాయంత్రం వేళల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ స్ప్రే చేపడుతున్నామన్నారు.

**ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి :**

ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత సామాగ్రిని ఇంటి పరిసరాలలో ఉండ కుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూల తొట్లలో నీరు ఉండకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



దోమల నిర్మూలనకు సులేమాన్ నగర్ లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



ఖాజా నగర్‌లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



కళ్యాణోత్సవంలో పాల్గొన్న మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు

మల్కాజిగిరి, ఆగస్టు 27(ప్రభాత ఉదయం) అమ్మవారి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. శ్రావణ మాస చివరి మంగళవారం సంధర్భంగా మల్కాజిగిరి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి , సతీమణి మర్రి మమతా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రావణ మాసంలో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తున్న ప్రతి ఒక్కరికీ అమ్మవారి , అశీసులుంటాయని, శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయ నిర్వాహకులు చాలా గొప్పగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని, నిర్వాహకులు కోరిన ప్రకారం తాను కూడా తనవంతు భాధ్యతగా అమ్మవారి ఆలయ తలుపుల ఏర్పాటుకు ఒక్క కిలో వెండిని బహుకరిస్తానని అన్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అరుంధతీ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్లు నిరుగొండ జగదీష్ గౌడ్ ,నిరుగొండా మంజుల గౌడ్, తదితరులున్నారు.




## హైదరాబాద్ నగర చెరువులను కాపాడటమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం

### నాలాలూ, చెరువులు అక్రమణలో కూకట్ పల్లి నియోజకవర్గం రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో ఉంది...

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో నాళాలు చెరువుల ఆక్రమణలో కూకట్ పల్లి నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో హైడ్రా పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ డిసాస్టర్ మేనేజ్మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ను ఏర్పాటు చేసారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు చెరువులను రక్షించడం, విపత్కర పరిస్థితుల్లో నగరానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూసుకునే ప్రధాన ఉద్దేశ్యంతోనే హైడ్రా పనిచేస్తుందని అన్నారు. 2014 నుండి 2023 వరకు హైదరాబాద్ ను బిఆర్ఎస్ నేతలు దోచుకున్నారని, నాలాలూ, చెరువులు ఆక్రమణలో కూకట్ పల్లి రాష్ట్రంలో నెంబర్ వన్ అని, హైదరాబాద్ నగర విధ్వంసాన్ని కాపాడండి అని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నయని అన్నారు. హైదరాబాద్ లో ఉన్న చెరువులను కాపాడటమే రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఎవ్వరు చేయలేని పనులను రేవంత్ రెడ్డి చేస్తున్నాడని అందరూ స్వాగతించాలని అన్నారు. రేవంత్ రెడ్డి మోసపూరిత వాగ్దానాలు చేయడని, రేవంత్ తీసుకున్న నిర్ణయాన్ని అన్ని పార్టీల నేతలు స్వాగతిస్తున్నారని చెప్పారు. హైడ్రా కు ప్రత్యేక యాప్ పెట్టి చెరువులను పరిరక్షించాలని సీఎం రేవంత్ రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి సత్యం శ్రీరంగం విజ్ఞప్తి చేసారు.



## 18వ సంవత్సరం రాజీవ్ గాంధీ మెమోరియల్ ఎన్ ఎస్ యు ఐ స్పోర్ట్స్ మీట్ విజయవంతం

### విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికే ఈ క్రీడలను నిర్వహిస్తున్నాం

### తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలుగా రాజీవ్ గాంధీ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎం. సాయి కిరణ్, విశ్వ, కె.నవీన్, అనూప్, కిరణ్, చిన్న, సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లలో వివిధ కళాశాలల విద్యార్థులు చాలా చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రీడా కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందాడి శివారెడ్డి, కందాడి సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరుపున ప్రతి సంవత్సరం విద్యార్థులలో పోటీ స్ఫూర్తిని తీసుకురావడానికి, క్రీడలలో వారి జీవితం మరియు ఆరోగ్య జీవితాన్ని ఎదగడానికి ఈ క్రీడలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ క్రీడలు విద్యార్థిని, విద్యార్థులకు మానసిక ఆనందంతోపాటు శారీర దారుణ్యాన్ని పెంపొందింప చేస్తాయని అన్నారు.



విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ నూతన ఎస్ ఈ చంద్రశేఖర్ కు పుష్పగుచ్చం అందజేస్తున్న డి ఈ దామోదర్ రావు

## సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ నూతన ఎస్ఈ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు, ఉద్యోగులు

మెహదీపట్నం, ఆగస్టు27(ప్రభాత ఉదయం) సైబర్ సిటీ విద్యుత్ సర్కిల్ నూతన ఎస్ ఈ గా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ ను సర్కిల్ కార్యాలయం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో నూతన ఎస్ ఈ గా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ కు సర్కిల్ డి ఈ (టెక్నికల్) దామోదర్ రావు ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ ఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా పని చేస్తూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కి సూచించారు.



నూతన ఎస్ ఈ చంద్రశేఖర్ కు పుష్ప బుచ్చం అందజేస్తున్న విద్యుత్ సబ్ ఇంజనీర్లు

## విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ నూతన ఎస్ఈ చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సర్కిల్ సబ్ ఇంజనీర్లు

మెహదీపట్నం, ఆగస్టు27(ప్రభాత ఉదయం) సైబర్ సిటీ సర్కిల్ విద్యుత్ ఎస్ ఈ గా చంద్రశేఖర్ పదవి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం నూతన ఎస్ ఈ చంద్రశేఖర్ కు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సబ్ ఇంజనీర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



శ్రీ జములమ్మ కళ్యాణ్ ఉత్సవంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

## ఘనంగా శ్రీ జమ్ములమ్మ కళ్యాణోత్సవ వేడుకలు

### కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి

గద్వాల, ఆగస్టు27(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా కేంద్రంలో జమ్మిచెడు శ్రీ శ్రీ శ్రీ జములమ్మ పరశు రాముడు దేవాలయంలో శ్రీ శ్రీ శ్రీ జమదగ్ని సమేత శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. కళ్యాణోత్సవ వేడుకల్లో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి అమ్మవారికి సాంప్రదాయ ప్రకారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఫారెస్ట్ విభాగం ఉన్నతాధికారికి వినతి పత్రం అందచేస్తున్న కురుమ సంఘం నాయకులు ఎస్. వెంకటేష్, తదితరులు

## శ్రీశైలం అడవుల్లో గొర్రెలను మేపుకోవడానికి అవకాశం ఇవ్వాలి

హైదరాబాద్, ఆగస్టు27(ప్రభాత ఉదయం) : పాలమూరు జిల్లా గొర్రె కాపరులను శ్రీశైలం అడవుల్లో గొర్రెలను మేపేందుకు ఫారెస్ట్ సిబ్బందిహొరానివ్వకుండాహొవేధిస్తున్నారని కురుమ సంఘం నాయకులు వాపోయారు. ఖరీఫ్ సీజన్లో సాగు విస్తీర్ణం పెరగడంతో గొర్రెల మేత కోసం అడవులకు వెళ్లడం జరుగుతుందని గుర్తు చేశారు. హైదరాబాద్ – పాలమూరు కురువ సంఘం కార్యవర్గ నాయకులు మంగళవారం ఉదయం నగరంలోని అరణ్య భవన్ లో అటవీశాఖ ఉన్నత అధికారి డోబిరియల్ కలిసి సమస్యలని వివరించారు. గొర్రె ల కాపరులకు అనుకూలంగా మాట్లాడడం జరిగింది... సానుకూలంగా స్పందించిన ఉన్నతాధికారులు. వారు మూడు కండిషన్ లు పెట్టారు. గొర్రెల మాత్రమే మేపాలని, మేకలు ఉండకూడదని సూచించారు. చెట్లను నరకకూడదని, మొక్కలు ఉన్నచోట జాగ్రత్త వహించాలన్నారు. వంట వార్పు చేసుకున్న తర్వాత మంటలు ఆర్పేయాలన్నారు. ఖచ్చితంగా ఈ నిబంధన పాటించాలని సూచించారు. గొర్రె కాపరులు అధికారులు చెప్పిన నిబంధనలు పాటించి సహకరించవలసిందిగా నాయకులు కోరారు. అధికారులు ను కలిసిన వారిలో శంకరోళ్ళ రవి కుమార్ కురువ, జిల్లా అధ్యక్షులు మాదారం కృష్ణ కురువ , జంటనగరాల అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురవ , సలహాదారు కన్మనూరు రామ్ కురువ, సెక్రటరీహొబాన్యనోల రామచంద్ర కురువ .. వైస్ ప్రెసిడెంట్ జైట్రం శ్రీనివాస్ కురువ, అప్ప శ్రీను కురువ , నామాల రామ్ కురువ, శివ కురువ, మల్లేష్, ప్రవీణ్, సన్నీ కురువ, జేక్లర్ నర్సింహ్మా కురువ , రిషి కురువ, గబ్బర్ సింగ్, డీకే నర్సింహ్మా కురువ , గుడిగండ్ల కుల పెద్దలు, జేక్లర కుల పెద్దలు పాల్గొన్నారు.



## విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం) విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్, జనతా నగర్, హనుమాన్ ఆలయం వద్ద వి.హెచ్.పి జిల్లా ప్రతినిధులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.ఎచ్.పి నాయకులు వారిని ఘనంగా స్వాగతించి సన్మానించారు.



## రామకృష్ణపురం గ్రామంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుక

కొత్తకోట, ఆగస్టు27(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను గ్రామ యాదవ సోదరులు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు కలిసి ఘనంగా ఉట్ల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ చక్రి వర్ధన్ రెడ్డి, యాదవ సోదరులు,కార్యక్రమం లో పాల్గొని స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.



గోకులాష్టమి వేడుకల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే జిఎంఆర్

## కొత్తకోట పట్టణ కేంద్రంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

కొత్తకోట, ఆగస్టు27(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన శ్రీకృష్ణుడి శోభాయాత్రలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే జిఎంఆర్ లు శ్రీకృష్ణుని దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్ల మహోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోగద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు సరిత తిరుపతయ్య , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.